క్లుప్తంగా

టీజీఎంఈయూ రాష్ట్ర కార్యదర్శిగా కిషన్



కమలాపూర్ : తెలంగాణ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ (టీజీఎంఈయూ) రాష్ట్ర కార్యదర్శిగా కమలాపూర్ మండలానికి చెందిన పుల్లా కిషన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన టీజీఎంఈయూ ఐదో రాష్ట్ర మహాసభలో కిషన్ ను రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నుకున్నారు. సోమవారం కిషన్ ఎన్నిక పట్ల యూనియన్ నాయకులతో పాటు మండల వాసులు హర్షం వ్యక్తం చేస్తు శుభాకాంక్షలు తెలిపారు.

న్యాక్ గుర్తింపునకు రికార్డులు సిద్ధం చేయాలి



అధ్యాపకులకు ప్రజెంటేషన్ ఇస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్

పరకాల : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందజేస్తున్న పరకాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల న్యాక్ గుర్తింపు సాధిస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సంతోష్‌కుమార్ ఆశాభావం వ్యక్తం చేశారు. సోమవారం డిగ్రీ కళాశాలలో న్యాక్ ప్రమాణాలపై అధ్యాపకులకు ప్రజెంటేషన్ నిర్వహించారు. న్యాక్ గుర్తింపునకు అధ్యాపకులు న్యాక్ ప్రమాణాల ప్రకారం రికార్డులు సిద్ధం చేయాలని కోరారు. స్టాఫ్ సెక్రటరీ డాక్టర్ అలీశాల అశోక్, అధ్యాపకులు డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, భీంరావు, ఎ.పావని, కల్పన, మహేందర్‌రావు, సమ్మయ్య, ఈశ్వరయ్య, మోరె, స్వప్న, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

'సిరికొండ' జన్మదిన వేడుకలు



శాయంపేట : తెలంగాణ శాసనమండలి ప్రతిపక్ష నాయకుడు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, సిరికొండ అభిమానులు సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ జిల్లా సెక్రటరీ ప్రొఫెసర్ గడ్డం భాస్కర్ కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, సిరికొండ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

108 వాహనం తనిఖీ



ఖిలా వరంగల్ : వరంగల్ ఉర్సు కరీమాబాద్‌లోని ప్రసూతి ఆస్పత్రి ప్రాంగణంలో 108 వాహన కేంద్రాన్ని సోమవారం జిల్లా ఇన్‌చార్జ్ భరత్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా 108 సిబ్బంది హాజరు రిజిస్టర్, పరికరాలు, వెహికల్ మెయింటెనెన్స్, నెలవారి కేసుల వివరాల రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి అభినందించారు. ఆయన వెంట స్టాఫ్ మెడికల్ టెక్నీషియన్ క్రాంతికుమార్, పైలెట్ చంద్రసేన ఉన్నారు.

ఈ ఏడాది కొత్త నోములు లేవు

కాజీపేట : ఈ ఏడాది కేదారేశ్వర వ్రతం (కొత్త నోముల) చేసుకోవడానికి అవకాశం లేదని అభయాంజనేయస్వామి దేవాలయం ప్రధాన అర్చకులు జాగర్లపూడి శ్రీనివాస్ శర్మ అన్నారు. దక్షిణ ముఖ అంజన్న ఆలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఈ నెల 20న మంగళ హారతులు, దీపావళి ధనలక్ష్మి పూజలు చేసుకోవాలన్నారు. 21 మంగళవారం కేదారేశ్వర వ్రతం ఆచరించి 22న బుధవారం దేవుడిని ఎత్తుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

విద్యార్థులు లక్ష్యంతో చదవాలి

కాజీపేట : విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని చదివినప్పుడే జీవితంలో ఉన్నత స్థితికి ఎదగడానికి అవకాశం ఉంటుందని గ్రూప్ కెప్టెన్ జీ.జే.రావు అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం పదో తరగతిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. సమావేశంలో పెన్షనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుగ్రపు సుధాకర్, జీజేరావు ట్రస్ట్ డైరెక్టర్ పుష్ప, ప్రధానోపాధ్యాయులు ఫ్రాన్సిస్, పూర్వ విద్యార్థులు జయదేవ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీకి ఈ-కేవైసీ



ఈ-కేవైసీ చేస్తున్న ఈజీఎస్ సిబ్బంది



ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

ఇక ఫేస్ రికగ్నేషన్‌తో హాజరు

- కొనసాగుతున్న ఉపాధికూలీల నమోదు
- మండలంలో 93.4శాతం పూర్తి

ఆత్మకూరు : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని మరింత బలోపేతం చేసేందుకు కేంద్ర మంత్రిత్వ శాఖలు ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్ (ఈ-కేవైసీ) పద్ధతిని ప్రవేశపెట్టాయి. ఇటీవల హనుమకొండ జిల్లాను పైలట్ ప్రాజెక్టుగా తీసుకొని ప్రస్తుతం అన్ని మండలాల్లో ఈ-కేవైసీ పని కొనసాగుతోంది. ఆత్మకూరు మండలంలో ఈజీఎస్ సిబ్బంది సైతం ముమ్మరంగా ఈకేవైసీ చేస్తున్నారు. అయినప్పటికీ ఇంకా 6శాతం పైగా ఉపాధికూలీలు ఈ-కేవైసీ చేసుకోవాల్సి ఉంది. ఈ-కేవైసీ చేయడం వల్ల ఉపాధి హామీ కూలీల వివరాలు అప్‌డేట్ అవుతాయి. అలాగే కూలీల హాజరు కచ్చితంగా నమోదవుతుంది. ఈ-కేవైసీ చేసుకోవడం వల్ల హాజరును ఫేస్ రికగ్నేషన్‌తో తీసుకుంటారు. సిబ్బంది ఉపాధికూలీల ఇళ్లకు వెళ్లి ఈకేవైసీ నమోదు చేస్తున్నారు.

ఉపాధి కూలీల వద్దకే సిబ్బంది..

మండలంలోని 16 గ్రామ పంచాయతీల పరిధిలో 7,164 మంది ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. ఇందులో 6,693 మంది ఈ-కేవైసీ పూర్తి చేసుకున్నారు. మొత్తం 93.4శాతం నమోదు పూర్తయ్యింది. ఇంకా 471మంది మిగిలి ఉన్నారు. అక్కంపేటలో 496 మందికి 425 మంది, అగ్రంపహాడ్‌లో 319 మందికి 283, లింగమడుగుపల్లె గ్రామంలో 238 మందికి 213, కొత్తగట్టు గ్రామంలో 173 మందికి 155, మల్కపేటలో 345కి 310 మంది, హౌజుబుజుర్గు గ్రామంలో 618కి 565, ఆత్మకూరులో 1,066 మందికి 982, నీరుకుళ్లలో 770 మందికి 720, కటాక్షపూర్ గ్రామంలో 346 మందికి గాను 325, పెద్దాపూర్ గ్రామంలో 660కి 629, చౌళ్లపల్లి గ్రామంలో 454కి 436, గుడెప్పాడ్ గ్రామంలో 313కి 305, కామారంలో 461కి 451, పెంచికలపేటలో 631కి 621, నాగయ్యపల్లెలో 176కి 174, తిరుమలగిరి గ్రామంలో 98 మందికి 97మంది ఈకేవైసీ పూర్తి చేసుకున్నారు. మిగతా వారు ఈ-కేవైసీ పూర్తి చేయడానికి ఈజీఎస్ సిబ్బంది ఉపాధికూలీల ఇంటి వద్దకు వెళ్తున్నారు. కొద్దిరోజుల్లో 100శాతం పూర్తిచేయనున్నట్లు ఈజీఎస్ ఏపీఓ తెలిపారు.

ఈ-కేవైసీ తప్పనిసరి



ఉపాధి హామీ కూలీలు ఈ-కేవైసీ పూర్తి చేసుకుంటనే పని కల్పించడం జరుగుతుంది. ఈ-కేవైసీ లేకుంటే మస్టర్ వేయడం సాధ్యం కాదు. ఉపాధిహామీ కూలీలు అందరూ వెంటనే ఈ-కేవైసీ చేసుకోవాలి. - రాజిరెడ్డి, ఈజీఎస్, ఏపీఓ

ఆలయ పునర్నిర్మాణం శుభపరిణామం



ఆలయాన్ని సందర్శించిన రోహిత్ నేత

ఆత్మకూరు : మండల కేంద్రంలో కాకతీయుల కాలంనాటి పార్వతీదేవి సమేత మహాదేవస్వామి ఆలయాన్ని పునర్నిర్మించడం శుభపరిణామమని హనుమకొండ డిప్యూటీ కలెక్టర్ రోహిత్ నేత పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మహాదేవస్వామి ఆలయాన్ని సోమవారం ఆయన సందర్శించారు. అర్చకులు శ్రావణ్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. రోహిత్ నేతను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించారు. త్వరలోనే మళ్లీ ఆలయాన్ని సందర్శిస్తానని ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని రోహిత్‌నేత అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వంగాల బుచ్చిరెడ్డి, ఆర్‌ఐ ఫరూక్ మహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సంఘం సభ్యులు

ఆత్మకూరు : మండలంలోని హౌజుబుజుర్గు గ్రామంలో చేయూత పొదుపు సంఘం సభ్యుడు షేక్‌మౌలాలి అనారోగ్యంతో మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబానికి పొదుపు సంఘం ఆధ్వర్యంలో రూ.20వేల ఆర్థికసాయాన్ని సోమవారం అందజేశారు. సంఘం అధ్యక్షుడు నీల రవీందర్ మాట్లాడుతూ.. పొదుపు సంఘం ద్వారా పేద కుటుంబాలకు తోడుగా ఉంటున్నామని అన్నారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు సయ్యద్ మౌలా, సభ్యులు షేక్ హుస్సేన్, సయ్యద్ కరీం, బొడిగె రాంబాబు, నీలం కుమార్, సయ్యద్ మౌలా, యాకూబ్, శోభ, రజిత తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి చేయూత



రామచంద్రాచారికి నగదు అందజేస్తున్న మిత్రులు

శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాకకు చెందిన రాజోజు రామచంద్రా చారి నెలరోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. కాగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995-96లో రామచంద్రా చారితో కలిసి పదో తరగతి చదివిన స్నేహితులు ఈ విషయం తెలుసుకొని ఆపదలో మేమున్నాము అంటూ సోమవారం అతడిని ఓదార్చి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40వేల నగదు అందజేసి ధైర్యం చెప్పి భరోసా ఇచ్చారు. ఆపదలో ఆదుకున్న మిత్రులకు రామచంద్రా చారి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అన్న మహేందర్, బుస్స శ్రీనివాస్, ఏదుల మనోహర్, డి.సంజీవరావు, శంకర్, ఐలి సురేందర్, కోగిల భిక్షపతి, చంద్రమౌళి, బత్తుల వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



విరాళం అందజేస్తున్న దాత వెంకటయ్య

ఐనవోలు : మండలంలోని సింగారం గ్రామానికి చెందిన ఉపాధ్యాయుడు, దాత తోడెం వెంకటయ్య గ్రామంలో నిర్మిస్తున్న పెద్దమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి సోమవారం రూ.25,016 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా దాతకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ దర్వాజ స్థాపన ఘనంగా నిర్వహించినట్లు చెప్పారు. ముత్యాల ఉప్పలయ్య, గ్రామస్తులు, ముదిరాజ్‌లు, భక్తులు పాల్గొన్నారు.

ట్యాంక్‌బండ్‌పై చెత్త తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..



చెత్తను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

పరకాల : ట్యాంక్‌బండ్ సుందరీకరణకు ఓ వైపు కోట్ల నిధులు ఖర్చు చేసి అభివృద్ధి పనులు చేపడుతుండగా మరోవైపు చెత్త చెదారంతో డంపింగ్ యార్డును తలపిస్తుంది. దీంతో ఈ నెల 12న ఓ వైపు సుందరీకరణ.. మరోవైపు చెత్త చెదారం శీర్షికతో 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై పరకాల మున్సిపల్ అధికారులు స్పందించారు. కమిషనర్ కె.సుష్మ ఆదేశాల మేరకు మున్సిపల్ శానిటేషన్ అధికారి కృష్ణస్వామి చెరువు కట్ట వద్ద పేరుకుపోయిన చెత్తను పొక్లెయినర్ సాయంతో తొలగించారు. చెరువు కట్టపై చెత్తచెదారం వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ జవాన్లు సాంబరాజు, రాజు, మంద మహేష్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

26న ఓరుగల్లు గాన కళావైభవం

నయీంనగర్ : ప్రజావాగ్గేయకారుడు, శాస్త్రమిత్ర సభ్యుడు మైస ఎర్రన్న ఈ నెల 26న కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ఓరుగల్లు గాన కళావైభవం కార్యక్రమం కరపత్రాన్ని సోమవారం 53వ డివిజన్ ఆదర్శకాలనీలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శాస్త్రమిత్ర అధ్యక్షుడు పరికిపండ్ల వేణు మాట్లాడుతూ 26న జరిగే ఓరుగల్లు గాన కళా వైభవంలో మైస ఎర్రన్న అభ్యుదయ గీతాలను సాహిత్యం చూడకుండా ఏకధాటిగా 100 పాటలతో 5 గంటల పాటు వేదిక పూన పాటల సునామీని సృష్టించనున్నారని తెలిపారు. గ్రామన్నారాయణ, ధర్మప్రకాష్, నాగరాజం, శ్రీనివాస్, లింగమూర్తి, సోమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ఎండీని కలిసిన నాయకులు



ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసిన టీఎంయూ నాయకులు

హన్మకొండ : టీజీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డిని వరంగల్ రీజియన్‌కు చెందిన టీఎంయూ సోమవారం నాయకులు కలిశారు. హైదరాబాద్‌లోని బస్‌భవన్‌లో ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఎండీ వై.నాగిరెడ్డిని ఆర్టీసీ తెలంగాణ మజ్దూర్ యూనియన్ వరంగల్ రీజియన్ అధ్యక్షుడు ఎస్‌కె. వై.పాషా, కార్యదర్శి సీహెచ్.జితేందర్ రెడ్డి, నాయకులు ఎండీ.గౌస్, బీఆర్.కుమార్, వీహెచ్.కిరణ్, పీ.పీ. రెడ్డి, ఎస్.వై.రెడ్డి, కె.అశోక్ రెడ్డి, ఎం.ఎస్.రావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. అలాగే టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ వై.నాగిరెడ్డిని ఆర్టీసీ కరీంనగర్ జోన్ కళాకారులు ఆదివారం వరంగల్-1 డిపోలో కళాకారుడు సాంబయ్య ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

శిథిలావస్థలో కాకతీయ పైలాన్

- పర్యాటకులను ఆకర్షించేందుకు రూ.2.50 కోట్లతో అభివృద్ధి
- పైలాన్ చుట్టూ ఊడిపోతున్న కాకతీయ రాజుల బొమ్మలు



వడ్డెపల్లి కట్టపై శిథిలావస్థకు చేరిన పైలాన్



పైలాన్‌పై ఊడిపోయిన బొమ్మలు

కాజీపేట : పట్టణంలోని 61వ డివిజన్ సిద్ధార్థనగర్ వడ్డెపల్లి రిజర్వాయర్ కట్టపై పుష్కరకాలం కింద ఆవిష్కరించిన కాకతీయ పైలాన్ శిథిలావస్థకు చేరుకుంది. పర్యాటకులను ఆకర్షించడానికి దాదాపు రూ.2.50 కోట్లతో కట్టను అభివృద్ధి చేశారు. చిన్న, పెద్దలను ఆకట్టుకునేలా పలు అభివృద్ధి పనులతో అందంగా తీర్చిదిద్దారు. ఈ నేపథ్యంలో మున్సిపల్, 'కుడా' అధికారులు 2012లో ఒక పైలాన్‌ను అప్పటి కేంద్రమంత్రి బలరాంనాయక్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. ఈ పైలాన్ పై కంచుతో తయారు చేసిన కాకతీయ రాజుల బొమ్మలను ఏర్పాటు చేశారు. అధికారుల చర్య ఆరంభశూరత్వంలా మారడంతో పైలాన్ క్రమేపి శిథిలావస్థకు చేరుకుంది. పైలాన్ చుట్టూ అమర్చిన బొమ్మలు ఒక్కొక్కటిగా అన్ని ఊడిపోతున్నాయి. పైలాన్ గద్దె చుట్టూ ఏర్పాటు చేసిన గ్రానైట్ రాయి పూర్తిగా ధ్వంసమైంది. మున్సిపల్, 'కుడా' అధికారులు పైలాన్‌ను పట్టించుకోకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పైలాన్‌కు మరమ్మతు చేయించాలని పలువురు కోరుతున్నారు.

కాంగ్రెస్‌కు ఓటు అడిగే హక్కులేదు

- బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము



దుర్గంపేటలో బాకీ కార్డు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాము తదితరులు

దామెర : కాంగ్రెస్ పార్టీ నాయకులకు ఓటు అడిగే నైతిక హక్కు లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గండు రాము పేర్కొన్నారు. మండలంలోని దుర్గంపేటలో సోమవారం కాంగ్రెస్ బాకీ కార్డును పంపిణీ చేసి కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పి సీఎం రేవంత్ రెడ్డి మాట తప్పారని విమర్శించారు. ఏడాదిన్నర పాలనలో ఒక్కో మహిళకు రూ.55వేలు, రైతులకు రుణమాఫీ, రైతు బంధు రూ.76వేలు, వృద్ధులు, వితంతువులకు రూ.44వేలు, ఆటో కార్మికులకు రూ.24వేలు, విద్యార్థినులకు స్కూటీలు ఇస్తామని, ప్రజలకు బాకీ పడ్డారని పేర్కొన్నారు. పథకాలు అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వెల్లడించారు. రైతులకు కనీసం యూరియా కూడా సరఫరా చేయని అసమర్థ పాలన రాష్ట్రంలో కొనసాగుతోందని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నాయకులు చెల్పూరి చంద్రయ్య, రాజేందర్ రెడ్డి, రాజశేఖర్, శివ, వీరేశం, దివాకర్, సదానందం, అనిల్, రాజ్‌కుమార్, సైలాని, రఘుపతి, సమ్మయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పనిచేసే వారికే అధ్యక్ష పదవి ఇవ్వాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి



అభిప్రాయ సేకరణలో పాల్గొన్న కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, నాయకులు

శాయంపేట : కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేసే వారికే జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి కోరారు. సోమవారం హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో జిల్లా అధ్యక్ష ఎంపిక కోసం నిర్వహించిన సమావేశంలో ఎన్నికల పరిశీలకులు నవీన్ పట్నాయక్‌కు మండలాల వారిగా అభిప్రాయ సేకరణ చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ.. కష్ట కాలంలో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి పారదర్శకంగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించే నాయకత్వ లక్షణాలు ఉన్నవారికి జిల్లా అధ్యక్ష పదవి ఇవ్వాలని నవీన్ పట్నాయక్‌కు తెలిపారు. నాయకులు బాసాని చంద్రప్రకాశ్, పోలెపల్లి శ్రీనివాస్ రెడ్డి, చిందం రవి, మారెపల్లి రవీందర్, చిట్టిరెడ్డి రాజిరెడ్డి, దుబాసి కృష్ణమూర్తి, వైనాల కుమారస్వామి, అబ్బు ప్రకాశ్‌రెడ్డి, డీటీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు కిషన్‌రావు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : ఆరుగాలం కష్టపడి పండించిన పత్తి పంట విక్రయాలకు ఎలాంటి షరతులు లేకుండా తక్షణమే సీసీఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు డిమాండ్ చేశారు. వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ మార్కెట్ కార్యదర్శికి సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ.. రైతులు పండించిన పత్తి పంట చేతికి వచ్చినా విక్రయించేందుకు సీసీఐ కేంద్రాలు అందుబాటులోకి లేకపోవడంతో దళారులను ఆశ్రయించి తీవ్రంగా నష్టపోతున్నట్లు ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం క్వింటాకు ధర రూ.8,110 ఉండగా దళారులు రూ.4వేల నుంచి రూ.5,500 వరకు మాత్రమే ధర చెల్లించడం వల్ల రైతులు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తక్షణమే వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు లంకదాసరి అశోక్, సురావు బాబురావు, కిషన్‌రావు, కోడం రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

రైతులు దళారులను నమ్మిమోసపోవద్దు

వానాకాలం సీజన్‌కు మార్కెట్‌లో పత్తికి సీసీఐ ద్వారా క్వింటాకు కనీస మద్దతు ధర రూ.8,110 ప్రభుత్వం ప్రకటించింది. రైతులు లైసెన్స్ లేని వ్యాపారస్తులు, దళారులను నమ్మిమోసపోవద్దని పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో కోరారు. కొద్ది రోజుల్లోనే వ్యవసాయ మార్కెట్ ఆవరణలో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరకాల మార్కెట్ నుంచి లైసెన్స్ పొందిన వ్యాపారస్తులకు విక్రయించుకోవాలని, లేనట్లయితే తక్కువ తూకాలతో రైతులను మోసం చేయడానికి అవకాశాలు ఉంటాయని రాజిరెడ్డి పేర్కొన్నారు.

క్రీడలతోనే యువతకు ఉజ్వల భవిష్యత్

- కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య



ఓవరాల్ చాంపియన్ షిప్ సాధించిన జట్టు క్రీడాకారులతో ప్రొఫెసర్ వై.వెంకయ్య

మామునూరు : చదువుతో పాటు ఆటల్లో రాణించిన క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని కేయూ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ప్రొఫెసర్ వై. వెంకయ్య, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్, స్పోర్ట్స్ డైరెక్టర్ ఎర్రగట్టు స్వామి పేర్కొన్నారు. ఖిలా వరంగల్ మండలం బొల్లికుంట వాగ్దేవి క్రీడామైదానంలో కేయూ ఆధ్వర్యంలో వాగ్దేవి కాలేజీ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సునీల్‌రెడ్డి సహకారంతో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంటర్ కాలేజీ టోర్నమెంట్స్ సోమవారం సాయంత్రం ముగిశాయి. వాగ్దేవి కాలేజీ డైరెక్టర్ సీహెచ్.వాణిదేవి, సీహెచ్.సుదర్శన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. యువకులు అంతర్జాతీయ క్రీడాకారులను ఆదర్శంగా తీసుకుని క్రీడలపై మక్కువ పెంచుకుని వారిస్థాయిలో రాణించాలని సూచించారు. అనంతరం సింగరేణి కాలరీస్ ఉమెన్స్ డిగ్రీ కళాశాల కొత్తగూడెం జట్టు చాంపియన్ షిప్ ట్రోఫీ అందుకుంది. పలు క్రీడల్లో విజేతలుగా నిలిచిన జట్లకు బహుమతులు, ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడల ఆర్గనైజింగ్ సెక్రటరీ పోలె లక్ష్మీపతి, పలు కళాశాలల ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

కేయూ స్పోర్ట్స్ బోర్డు అభివృద్ధికి కృషి



వీసీ ప్రతాప్‌రెడ్డిని కలిసిన కమిటీ బాధ్యులు

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలోని స్పోర్ట్స్ బోర్డు అభివృద్ధికి కృషి చేస్తానని వివిధ క్రీడలకు సంబంధించి క్రీడాకారులకు సదుపాయాలు కల్పిస్తామని కాకతీయ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కె.ప్రతాప్‌రెడ్డి హామీ ఇచ్చారు. యూనివర్సిటీ ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్స్ అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడు డాక్టర్ జె.సోమన్న, జనరల్ సెక్రటరీ డాక్టర్ కె.సునీల్‌రెడ్డి ఇతర బాధ్యులు సోమవారం వీసీని మర్యాద పూర్వకంగా కలిసి పూలబొకే అందజేశారు. పలు స్పోర్ట్స్ బోర్డుకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన వీసీ మాట్లాడుతూ ఒకసారి స్పోర్ట్స్ బోర్డును సందర్శించి అక్కడి సదుపాయాలకు సంబంధించిన వాటిని పరిశీలించి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ అభివృద్ధికి, క్రీడాకారులకు వివిధ సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అసోసియేషన్ కోశాధికారి కిరణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్.కుమారస్వామి, రమేష్, సహాయ కార్యదర్శులు మట్టెడ కుమార్, మధుకర్, కార్యవర్గసభ్యులు ఉన్నారు. అలాగే రిజిస్ట్రార్ రామచంద్రంను కూడా మర్యాదపూర్వకంగా కలిశారు.

వీసీని కలిసిన ప్రవాసభారతీయుడు

కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ కళాశాల పూర్వ విద్యార్థి , ప్రవాసభారతీయుడు, అమెరికాలోని ప్రముఖ ఫార్మసీ పారిశ్రామికవేత్త రాజు తోట సోమవారం కేయూ వీసీ కె.ప్రతాప్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. కేయూ ఫార్మసీ గోల్డెన్ జూబ్లీ ఉత్సవాలకు సంబంధించిన పలు అంశాలను ఈసందర్భంగా వారు చర్చించారు.